కత్వాచెరువులో ఇష్టారాజ్యంగా అనుమతులు

మండిపడుతున్న స్థానికులు || అధికారులపై చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

మల్లంపేట్‌లోని కత్వాచెరువు

దుండిగల్, సెప్టెంబర్10: కత్వాచెరువు ఆక్రమణల విషయంలో సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా అనేది దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. మూడురోజుల క్రితం హైడ్రా అధికారులు గండిమైసమ్మ-దుండిగల్ మండలం, మల్లంపేట్ లోని కత్వా(పెద్ద) చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను ఆక్రమించి నిర్మించిన 13 విల్లాలను నేలమట్టం చేసిన విషయం విధితమే. అయితే ఈ విషయంలో విల్లాల కొనుగోలు దారులే బలికావాలా..? లక్ష్మీశ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ బిల్డర్ గుర్రం విజయలక్ష్మిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు..? ఇందులో విల్లాల విక్రేతలు..కొనుగోలు దారులు మాత్రమే బాధ్యులా..? నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులు, దానికి వంతపాడిన వారు, చెరువు ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్‌లో విల్లాలు నిర్మిస్తుంటే కండ్లు మూసుకున్న ఇరిగేషన్ అధికారులు బాధ్యులవుతారా..? ఇంత విధ్వంసం జరుగుతుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారు..? అనే చర్చ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతుంది. నెల రోజుల క్రితం బాచుపల్లి మండల పరిధి, సర్వేనంబర్ 134లోని ఎర్రకుంటను ఆక్రమించి నిర్మించిన మూడు అపార్ట్‌మెంట్‌లను నేలమట్టం చేసిన హైడ్రా చెరువు విధ్వంసానికి కారకులయ్యారనే ఉద్దేశంతో బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్‌తో పాటు నాటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావుపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. బాచుపల్లి ఎర్రకుంట మాదిరిగానే మల్లంపేట్ కత్వా(పెద్ద) చెరువులో చోటుచేసుకున్న ఆక్రమణలు,అందుకు కారకులైన అధికారులపైనా హైడ్రా చర్యలు తీసుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కత్వాచెరువులో మొత్తం 360 విల్లాలు ఉండగా 60విల్లాలకు మాత్రమే హెచ్‌ఎండీఏ నుంచి నిర్మాణ సంస్థ అనుమతులు పొందింది. మిగిలిన 300 విల్లాలకు సంబంధించి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్క విల్లాకు వేర్వేరుగా అనుమతులు పొందినట్లు తెలుస్తుంది. అయితే వీటిలోనూ కొన్ని ఫేక్ అనుమతులు ఉన్నట్లు తెలుస్తుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలుకొని వివిధ విభాగాలకు చెందిన అధికారులను మేనేజ్‌చేసిన విజయలక్ష్మి ఇక్కడ పెద్ద సామ్రాజ్యాన్నే ఏర్పాటు చేసిందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేక పోతున్నారని ప్రజలు అంటున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ,సెప్టెంబర్ 10: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు విద్యార్థుల నుంచి 2023-24 ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్. వెంకట్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మాసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీజే, బీసీజే, ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎమ్ కోర్సులలో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు ఈ నెల 11 నుంచి అక్టోబర్ 10 వరకు సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 040-24658160,9491627404 లేదా www.mkvvgtrust.org లో సంప్రదించాలని కోరారు. ట్రస్టీలు విష్ణువర్ధన్, శ్రీనివాస్, నగేశ్, దేవేందర్, చంద్రశేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

పర్యాటక కోర్సులకు..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిధమ్)లో పర్యాటక కోర్సులు అభ్యసించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆమోది నిధమ్‌లో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల ప్రక్రియ కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. టూరిజం, హాస్పిటాలిటీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీల్లో పనిచేసే అవకాశం లభిస్తుందని వివరించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వివారాలకు 9553700034, 9553700035 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత శిక్షణ తరగతులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థలు ప్రతియేటా ఎలక్ట్రిషియన్ల కోసం నిర్వహించే వైర్‌మెన్ సూపర్‌వైజర్ పరీక్ష రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణనిస్తున్నామని తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ ఇన్‌బోర్డ్ మెంజర్ నేమాల బెనర్జీ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 13వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులకు హాజరుకావచ్చని, తరగతులను ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. వివరాలకు 7989349899, 9848258202 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మూసీలోకి 546 క్యూసెక్కుల నీరు విడుదల

సిటీబ్యూరో, సెప్టెంబరు 10 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లకు వరద కొనసాగుతున్నది. ఎగువ ప్రాంతాలు శంకర్‌పల్లి, నవాబ్‌పేట, ఖానాపూర్, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, మెయినాబాద్‌లలో కురుస్తున్న వానలతో వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలోనే ఉస్మాన్‌సాగర్‌కు 600, హిమాయత్‌సాగర్‌కు 600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, నిండుకుండలా మారిన జంట జలాశయాల నుంచి దిగువ మూసీలోకి 546 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా..1788.95 అడుగుల మేర నీటి నిల్వలు ఉండగా..హిమాయత్‌సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు ఉంటే 1761.60 అడుగులకు నీటి నిల్వ ఉంది. ఐతే దిగువ మూసీలోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతుండడంలో అధికారులు పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఇతర శాఖలతో జలమండలి సమన్వయ చర్యలు చేపట్టింది.

రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ

చౌటుప్పల్, సెప్టెంబర్ 10 : రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కాని రైతులు ఈ నెల 11న వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ముత్యాల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఫ్యామిలీ గ్రూప్ ఫొటో దిగి రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, పట్టాదారు పాస్‌బుక్, రుణ ఖాతా పాస్‌బుక్ జిరాక్స్‌లతో రావాలని పేర్కొన్నారు.

ఎస్ఐ రజనీకర్‌కు సన్మానం

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 10 : సర్వాయి పాపన్న మోకు దెబ్బ జిల్లా కమిటీ అధ్వర్యంలో ఆలేరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రజనీకర్‌ను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు దూడల రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథంగౌడ్, మండలాధ్యక్షుడు పోతుగంటి సంపత్ కుమార్ గౌడ్, నాయకులు నమిలె రాజయ్య, దూడల సాగర్ గౌడ్, సిద్ధార్థ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం కమిటీ ఎన్నిక

సురేశ్‌రెడ్డి

వెంకటేశ్వర్లు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 10 : జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం నూతన కమిటీని ఆలేరులో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూదాన్ పోచంపల్లి కాలేజీ ప్రిన్సిపాల్ బొందుగుల సురేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆలేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా జి.ప్రభాజస్టిస్, మహిళా సెక్రటరీగా బి.మాతేశ్వరి ఎన్నికయ్యారు.

మొరాయించిన హెచ్ఎండీఏ లేక్స్ వెబ్‌సైట్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా చర్యల ప్రభావం హెచ్ఎండీఏ లేక్స్ వెబ్‌సైట్‌పై పడింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని లేక్ ప్రొటెక్షన్ కమిటీ రూపొందించిన చెరువులకు సంబంధించిన సమగ్ర సమాచారంతో ఉన్న లేక్ వెబ్‌సైట్(https://lakes.hmda.gov.in) సేవలు మంగళవారం నిలిచిపోయాయి. హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 3300లకు పైగా చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎఫ్ మ్యాపులు, కెడస్ట్రల్ మ్యాపులు, చెరువుకు సంబంధించిన గుర్తింపు నంబర్, ఇతర వివరాలతో ఉన్న వెబ్‌సైట్ పనిచేయడం లేదు. అధికారులను సంప్రదిస్తే రాష్ట్ర సచివాలయంలోని స్టేట్ డాటా సెంటర్(ఎస్‌డీసీ)లో ఉందని తెలిపారు. చెరువుల చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన కట్టడాలను కూలుస్తుండటంతో తమ నివాసాలు ఏమైనా చెరువుల పరిధిలో ఉన్నాయో లేదో తనిఖీ చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. హెచ్ఎండీఏ పరిధిలోని గుర్తించిన చెరువులకు సంబంధించిన డేటా సులభంగా ఈ వెబ్‌సైట్ ద్వారా పొందే అవకాశం ఉండటంతో నగర వాసులు వెబ్‌సైట్‌ను ఎక్కువ సంఖ్యలో చూస్తుండటం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలిసింది.

నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నత్త నడకన సాగుతున్నాయి. పాఠశాలల్లో కనీస వసతులు సమకూర్చే ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. తాగునీరు సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, రిపేర్‌లు చేపట్టాల్సి ఉంటుంది. పాఠశాలలు ప్రారంభానికి ముందే ఈ పనులన్నీ పూర్తికావాలి. పాఠశాలలు ప్రారంభమై 3 నెలలు సమీపిస్తున్నా ఇంకా పనులు పూర్తికాలేదు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణ పనులపై పదుల సంఖ్యలో సమీక్షలు జరిపారు. ఎప్పటికప్పుడు అధికారులకు పనుల పూర్తి ఆదేశాలిస్తున్నారు. పలుమార్లు డెడ్‌లైన్స్ సైతం నిర్దేశించారు. ఇటీవల జరిగిన సమీక్షలో కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సెప్టెంబర్ 10లోపు పూర్తి చేయాలని సూచించారు. 78 పాఠశాలల్లో పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. అరకొర సౌకర్యాల మధ్యే విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

బీసీ కమిషన్‌లో కాంగ్రెస్ నేతలకే చోటు

రవీంద్రభారతి,సెప్టెంబర్10: తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ సహాసభ్యుల నియామకంలో తెలంగాణ ప్రభుత్వం బీసీ సంఘాలకు, మహిళా సంఘాలకు అన్యాయం చేసిందని తెలంగాణ బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణిమంజరిసాగర్ విమర్శించారు. కమిషన్‌లో పార్టీ నేతలకు పెద్దపీట వేశారని, ఎన్నో ఏళ్లుగా బీసీ కులాలతో కలిసి పనిచేస్తున్న కుల సంఘాల ప్రతినిధులకు చోటు దక్కుతుందని ఆశించినట్లు ఆమె తెలిపారు. కేవలం కాంగ్రెస్ పార్టీ నేతలకే సారథ్య బాధ్యతలు అప్పగించారని, వారు ప్రభుత్వానికి బీసీ సమస్యలు పూర్తి స్థాయిలో చెప్పగలరా..? అని సందేహం వ్యక్తం చేశారు. బీసీ కులాలకు న్యాయం జరగాలంటే బీసీ సంఘాల నుంచి బీసీ కమిషన్‌లో ప్రాతినిధ్యం ఉండాలని, ఇప్పటికైనా మరో ఇద్దరు సభ్యులను కమిషన్‌లోకి తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను మణిమంజరి సాగర్ కోరారు.

మూడేండ్లు ఏం చేశారు..?

ట్యాంక్‌బండ్‌లో విగ్రహాల నిమజ్జనంపై పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్‌లో ఏటా వినాయక విగ్రహాల నిమజ్జనం చేయడంలో 2021లో హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయడం లేదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మూడేళ్ల తర్వాత కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసే ముందు కనీసం సంబంధిత అధికారులకు కోర్టు ఆదేశాలు అమలు కావడం లేదని వినతిపత్రాలు కూడా ఇవ్వలేదని ఆక్షేపించింది. కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా హుస్సేన్ సాగర్ లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహాల నిమజ్జనం చేసిన ఫొటోలు లేదా ఇతర ఆధారాలు కూడా నివేదించలేదని చెప్పింది. పిటిషనర్ న్యాయవాదిగా (వ్యక్తిగత హోదాలో) ఉండి కూడా కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసే ముందుకు అనుసరించాల్సిన విధానాలను పాటించలేదని తప్పుపట్టింది. ఈ కారణాల రీత్యా వినాయక విగ్రహాల నిమజ్జనం వ్యవహారంపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను అనుమతించలేమని తేల్చి చెప్పింది. మూడేళ్ల తరువాత దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ ను ఏవిధంగా అనుమతించాలో చెప్పాలని పిటిషనర్ ను ప్రశ్నించింది. ఇదే సమయంలో 2021 సెప్టెంబర్ 9న ఇదే హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన విగ్రహాలను మాత్రమే హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం చేయాలని ప్రత్యేక ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలను జీహెచ్ ఎంసీ ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన కృత్రిమ కుంటలు, సరస్సుల్లోనే నిమజ్జనం చేయాలంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా జరుగుతోందంటూ న్యాయవాది మామిడి వేణుగోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ అనిల్ కుమార్లతో కూడిన ద్విసభ్య ప్రత్యేక ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

గర్భిణులకు సకాలంలో వైద్యమందించాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో మాతృమరణాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం 2023-24లో సంభవించిన మాతృమరణాలపై వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, మృతుల కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తి పవిత్రమైనదన్నారు. ప్రతి పీహెచ్‌సీలో గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ఆమెకు నిర్వహించే వైద్యపరీక్షల వివరాలు ఎంపీపీ కార్డులో నమోదు చేయాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను ఆలస్యం చేయకుండా చికిత్స అందించాలని ఆదేశించారు. శిశు మరణాలపై అప్రమత్తంగా ఉండాలనారు. ప్రైవేట్ ఆసుపత్రులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీహెంహెచ్ఓ డాక్టర్ వెంకట్, డీసీహెచ్ఎస్ రాజేంద్రనాథ్, నోడల్ అధికారులు డాక్టర్ సుచిత, డాక్టర్ సాధియా బేగం, జయమాలిని తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

సంతకాల సేకరణ పత్రాలు కలెక్టర్‌కు అందజేత

అబిడ్స్, సెప్టెంబర్ 10: గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ చేపట్టిన సంతకాల సేకరణ పత్రాలను స్థానికులు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి అందజేశారు. స్థానికులు, వివిధ పార్టీల నాయకులు బెజిని శ్రీనివాస్, ఆవుల వినోద్ యాదవ్, దత్తు కోయల్కర్, లత మాణిక్, నేహాల్, కోటి శైలేశ్ కురుమ, దుర్గ యాదవ్, విష్ణు, ఓంకార్, లాలాజీ, సరస్వతి, చంద్రమోహన్, స్వరూప, మేకల సునీత, ఈశ్వర్ మంగళవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ ఉస్మానియా దవాఖానను ఈ ప్రాంతంలో నిర్మిస్తే స్థానికంగా నివసించే తాము తీవ్ర ఇబ్బందులు పడుతామన్నారు. స్టేడియాన్ని ఆనుకుని ఉన్న బస్తీలు ఇరుకుగా ఉండగా ప్రధాన రహదారులలో ట్రాఫిక్ సమస్య తలెత్తే ప్రమాదముందని మార్చురీని ఏర్పాటు చేస్తే దుర్గంధ పూరిత వాసనతో రోగాల బారిన పడే ప్రమాదముంటుందని వాపోయారు. ఆసుపత్రి నిర్మాణ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్రెడిట్ సేఫ్ టెక్నాలజీ సంస్థ విస్తరణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): హైటెక్ సిటీ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్రెడిట్ సేఫ్ టెక్నాలజీ సంస్థ విస్తరణ కార్యకలాపాలను చేపట్టిందని మేనేజింగ్ డైరెక్టర్ కిశోర్ రెడ్డి కంచర్ల తెలిపారు. మంగళవారం హైటెక్ సిటీ ఫేజ్-2లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంపెనీ వ్యూహాత్మక విస్తరణ కార్యకలాపాలను కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ జాన్ సెరీతో కలిసి వెల్లడించారు. 200 దేశాల్లో సేవలను అందిస్తున్న తమ కంపెనీలో దేశంలో హైదరాబాద్ కేంద్రాన్ని అత్యంత కీలకమైందిగా భావిస్తోందన్నారు. ప్రస్తుతం 240 మందితో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలో 500 మంది నిపుణులు పనిచేసేలా విస్తరణ కార్యకలాపాలు చేపట్టనున్నామని తెలిపారు. హైటెక్ సిటీలో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సీటింగ్ కెపాసిటీని రెట్టింపు చేయడంతో పాటు అత్యాధునిక శిక్షణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు

శివంపేట్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ సస్పెన్షన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో అవినీతిపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌కు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు చేపట్టింది. నాలుగు రోజులుగా వస్తున్న ఫిర్యాదులను స్వీకరిస్తూ వాటిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి తప్పు చేసిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నది. తాజాగా మంగళవారం మెదక్ సర్కిల్ శివంపేట్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ చీఫ్ ఇంజినీర్, రూరల్ జోన్ భిక్షపతి ఆదేశాలు జారీ చేశారు. ఒక పనికి సంబంధించి అంచనాలు తయారు చేసి వర్క్ ఆర్డర్ రిలీజ్ చేయడానికి దుర్గా ప్రసాద్ లంచం డిమాండ్ చేస్తున్నారని సీఎండీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్ర స్థాయిలో చేసిన విచారణలో ఆరోపణలు రుజువవ్వడంతో చర్యలు తీసుకున్నారు.

ఆత్మహత్యలతో జీవితాన్ని ముగించొద్దు

కరపత్రాలను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్ రాజకుమారి, ప్రిన్సిపాల్ ఇందిర

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 10 : ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారం సందర్భంగా గాంధీ దవాఖాన మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన శిబిరం నిర్వహించారు. పీజీ, ఇంటర్న్ డాక్టర్లు కలసి మానసిక సమస్యలు ఎదుర్కొనేవారి ప్రవర్తన, వైద్యుల సంప్రదింపు అనంతరం కలిగిన మార్పు గురించి ఆకట్టుకునేలా స్కిట్ ప్రదర్శించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్.ఎన్. రాజకుమారి, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశేఖర్ రావు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సికింద్రాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యుల్లత మాట్లాడారు. విలువైన మానవ జీవితాన్ని చిన్న చిన్న కారణాలతో ముగించుకోవద్దని అన్నారు. గతేడాది లక్షా 64 వేల మంది వివిధ కారణాల వలన ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ నెల 4 వతేదీ నుంచి 10 వరకు వైద్యులు, వైద్య విద్యార్థులకు అవగాహన శిబిరం, వ్యాసరచన, కవితల పోటీలను నిర్వహించారు. గాంధీ దవాఖాన సైకియాట్రి విభాగం ఇన్‌చార్జి హెచ్ఓడీ, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ దవాఖాన నర్సింగ్ సూపరింటెండెంట్ దయానిధి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు, మానసిక విభాగం వైద్యులు, పీజీ, ఇంటర్న్ విద్యార్థులు పాల్గొన్నారు.

తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్‌కుమార్ మంగళవారం మాజీముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా ఆయనకు కేసీఆర్ పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

పీల్‌ఖానాలో భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

అబిడ్స్, సెప్టెంబర్ 10: అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మించిన ఓ భవనంపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. జీహెచ్ఎంసీ పద్నాల్గోవ సర్కిల్ కార్యాలయం పరిధిలోని గౌలిగూడ ప్రాంతంలో 5-1-43, 44 ఇంటి నిర్మాణానికి గాను సిల్ట్‌తో పాటు రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో జీహెచ్ఎంసీ పలు మార్లు నోటీసులు జారీ చేయడంతో ఇంటి యజమాని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టేటస్‌కో ఆర్డర్ తీసుకుని నిర్మాణాలు చేపట్టడంతో కూల్చివేతలు చేపట్టారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వుల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సయీదుద్దీన్, సెక్షన్ ఆఫీసర్ ముఖేశ్ సింగ్‌ల పర్యవేక్షణలో అదనపు అంతస్తులను కూల్చివేశారు. పీల్‌ఖానా ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఓ భవనాన్ని సీజ్ చేశారు. ఏసీపీ సయ్యద్ సయీదుద్దీన్ , సెక్షన్ అధికారి ముఖేశ్‌సింగ్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లలితాజ్యువెల్లరీ కోటి రూపాయల విరాళం



సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో వరదబాధితులను ఆదుకునేందుకు ప్రముఖ లలితాజ్యువెల్లరీ మార్ట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిసి కోటిరూపాయల విరాళం అందజేశారు. కిరణ్‌కుమార్‌ను సీఎం అభినందించారు.

ఎస్టీపీల సందర్శన

సిటీబ్యూరో, సెప్టెంబరు 10 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ మిరా